క్లుప్తంగా

చెడుకు దూరంగా ఉండండి



సీనియర్ సివిల్ జడ్జిని సన్మానిస్తున్న దృశ్యం

కర్నూలు సిటీ: యువత మాదక ద్రవ్యాలకు, చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు దూరంగా ఉండాలని సీనియర్ సివిల్ జడ్జి సీహెచ్ వెంకట నాగ శ్రీనివాసరావు, శాశ్వత లోక్ అదాలత్ జడ్జి ఎం.వెంకట హరినాథ్ అన్నారు. సోమవారం నగర శివారులోని రవీంద్ర మహిళా ఇంజినీరింగ్ కాలేజీలో యాంటీ ర్యాగింగ్, వినియోగదారుల హక్కులు, మాదక ద్రవ్యాల దుష్పరిణామాలపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి వారు ముఖ్య అతిథులుగా హాజరై ప్రసంగించారు. అనంతరం న్యాయమూర్తులను సన్మానించారు. కార్యక్రమంలో న్యాయవాదులు వి.జయలక్ష్మీదేవి, కాలేజీ స్పెషల్ ఆఫీసర్ డా.వై పాండురంగయ్య, ప్రిన్సిపాల్ డా.శ్రీనివాసమూర్తి, వైస్ ప్రిన్సిపాల్ డా.జె.ఉషశ్రీ, పాల్గొన్నారు.

బీసీ మహిళా జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా భారతి

కర్నూలు(అర్బన్): జాతీయ బీసీ మహిళా సంక్షేమ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నగరానికి చెందిన భారతి నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం హైదరాబాద్‌లోని తన నివాసంలో సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యులు ఆర్ క్రిష్ణయ్య ఆమెకు నియామకపత్రం అందించారు. కార్యక్రమంలో సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి నక్కల మిట్ట శ్రీనివాసులు, రాష్ట్ర ప్రచార కార్యదర్శి ఎం.రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

విద్యలో ముందుండాలి

కర్నూలు(అర్బన్): ఆర్యవైశ్య సామాజిక వర్గానికి చెందిన విద్యార్థులు విద్యా పరంగా ముందుండాలని రాజ్యసభ మాజీ సభ్యులు టీజీ వెంకటేష్ కోరారు. ఆవోపా ఆధ్వర్యంలో 22వ విడత ఆర్థిక సహకార పంపిణీ కార్యక్రమంలో భాగంగా అర్హులైన విద్యార్థులకు ఆర్థిక సహాయం అందించారు. స్థానిక ఆవోపా సదన్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి అతిథిగా టీజీ హాజరై మాట్లాడారు. పొలిమేర వేణుగోపాల్ కామక్షమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ఆర్యవైశ్య ఆణిముత్యాలకు ప్రతిభా పురస్కార్ గోల్డ్ మెడల్, మెమొంటోలను అందించి శాలువా కప్పి సన్మానించారు. అలాగే అక్షయ విద్యా నిధి దాతలు, తదితరులు చెక్కులను అందించారు. కార్యక్రమంలో ప్రముఖ పారిశ్రామిక వేత్త టీజీ భరత్, టీజీ శివరాజ్, నగరూరు శమంతకమణి, ఆవోపా విద్యా నిధి చైర్మన్ కేవీ ప్రసాద్, కన్వీనర్ ఎం. నాగేశ్వరరావు, అధ్యక్షులు ఎంవీ సురేష్, కార్యదర్శి జీవీ మురళీక్రిష్ణ, కోశాధికారి ఎం పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

'శ్రీకృష్ణ కర్ణార్జునీయం'కు ఐదు హనుమ అవార్డులు

కర్నూలు కల్చరల్: టీజీవీ కళాక్షేత్రం వారి 'శ్రీకృష్ణ కర్ణార్జునీయం' పద్య నాటకం ఐదు హనుమ అవార్డులు కైవసం చేసుకుంది. తిరుపతి మహతి ఆడిటోరియంలో ఈనెల 23 నుంచి 30వ తేదీ వరకు అభినయ ఆర్ట్స్ 23వ జాతీయ స్థాయి పద్య, సాంఘిక నాటక పోటీలు జరిగాయి. పోటీల్లో టీజీవీ కళాక్షేత్రం కళాకారులు 'శ్రీకృష్ణ కర్ణార్జునీయం' పద్య నాటకం ప్రదర్శించారు. ఈ నాటకం తృతీయ స్థానంలో నిలిచి రూ.30 వేల పారితోషికం గెలుచుకుంది. ఉత్తమ దర్శకత్వంలో పత్తి ఓబులయ్య, ఉత్తమ సహాయ నటుడిగా జీవీ శ్రీనివాసరెడ్డి, ఉత్తమ నటి సురభి వెంగమాంబ, ఉత్తమ రంగాలంకరణ సురభి సంతోష్ నిలిచి హనుమ అవార్డులు అందుకున్నారు.

నగరపాలకలో స్పందన



కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

కర్నూలు (టౌన్) : స్పందన కార్యక్రమం దృష్టికి వచ్చిన సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు నగర పాలక కమిషనర్ భార్గవ్‌తేజ తెలిపారు. సోమవారం స్థానిక నగరపాలక కౌన్సిల్ హాలులో స్పందన నిర్వహించారు. నగరానికి చెందిన పలువురు వివిధ సమస్యలపై కమిషనర్‌కు వినతి పత్రాలు అందజేశారు. ఎస్ఈ వేణుగోపాల్, అడిషనల్ సిటీ ప్లానర్ హాయత్ మోద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ఊపిరాడటం లేదు!

- జిల్లాలో పెరుగుతున్న ఊపిరితిత్తుల క్యాన్సర్ బాధితులు
- ధూమపానం చేయడమే ప్రధాన కారణం
- ఆరోగ్యశ్రీలో ఉచితంగా చికిత్స
- త్వరలో స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ నిర్మాణం పూర్తి
- నేడు ప్రపంచ ఊపిరితిత్తుల క్యాన్సర్ దినోత్సవం



కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల ఆవరణలో నిర్మిస్తున్న స్టేట్ క్యాన్సర్ ఇన్స్టిట్యూట్

కర్నూలు(హాస్పిటల్): పొగతాగితే ప్రమాదమని బీడీ, సిగరెట్ పెట్టెలపైనా, సినిమా, టీవీలలో వేస్తున్నా కొందరు వాటిని మానడం లేదు. పొగతాగిన వారితో పాటు ఆ పొగ పీల్చిన వారికి సైతం ఊపిరితిత్తుల క్యాన్సర్ వస్తుందని వైద్యులు చెబుతున్నా ఏ ఒక్కరూ చెవిన వేసుకోవడం లేదు. రొమ్ము, పెద్దపేగు, ప్రొస్టేట్ క్యాన్సర్‌ల కంటే ఊపిరితిత్తుల క్యాన్సర్ అత్యంత ప్రమాదకరమైనది. ఎక్కువ మంది ఈ క్యాన్సర్‌తోనే ప్రాణాలు కోల్పోతున్నారు. నేడు ఊపిరితిత్తుల క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.

జిల్లాలో ఊపిరితిత్తుల క్యాన్సర్ రోగుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. ఆధునిక వైద్యసదుపాయాలు, ఈ వ్యాధికి ఆరోగ్యశ్రీలో ఉచితంగా వైద్యం అందిస్తుండటంతో చాలా మంది చికిత్స తీసుకుని కోలుకుంటున్నారు. కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని క్యాన్సర్ విభాగానికి ప్రతి సంవత్సరం 600 మంది రోగులు చికిత్సకోసం వస్తుండగా అందులో 110 మంది ఊపిరితిత్తుల క్యాన్సర్‌తో బాధపడే వారున్నారు. వీరిలో అధిక శాతం 3, 4 స్టేజిలలో చికిత్స కోసం వస్తుండగా 10 శాతం మంది కోలుకోలేక మరణిస్తున్నారు. ఈ క్యాన్సర్‌కు చికిత్స అందించేందుకు ఆసుపత్రిలో ఇద్దరు సర్జికల్ అంకాలజిస్టులు ఉన్నారు. వీరు ఊపిరితిత్తుల్లో ఏర్పడిన క్యాన్సర్ కణితులను తొలగించడం, దెబ్బతిన్న ఊపిరితిత్తిలోని కొంత భాగాన్ని తీసివేయడం చేసి అనంతరం కీమోథెరపి చికిత్స అందిస్తున్నారు. ఈ ఆసుపత్రితో పాటు నగరంలోని ఒమెగా హాస్పిటల్, విశ్వభారతి క్యాన్సర్ హాస్పిటల్‌లలోనూ డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా క్యాన్సర్ రోగులకు చికిత్స అందిస్తున్నారు. ఆయా ఆసుపత్రుల్లోనూ ప్రతిరోజూ కొత్త, పాత రోగులు 150 నుంచి 200 మంది చికిత్స కోసం వెళ్తుండగా అందులో ఊపిరితిత్తుల క్యాన్సర్‌తో 40 మంది దాకా ఉంటున్నారు.

త్వరలో స్టేట్ క్యాన్సర్ ఇన్స్టిట్యూట్ ప్రారంభం

కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల ఆవరణలో ఏర్పాటవుతున్న స్టేట్ క్యాన్సర్ ఇన్స్టిట్యూట్ నిర్మాణం దాదాపుగా పూర్తికావస్తోంది. రూ.120 కోట్లతో 120 పడకల సామర్థ్యంతో నిర్మిస్తున్న ఈ విభాగంలో అత్యాధునిక లీనియర్ ఆక్సలరేటర్ (రేడియేషన్ మిషన్), ఎక్స్‌టర్నల్ ఆర్‌టీ మిషన్, బ్రాచి థెరపీ హెచ్‌డీఆర్(నేరుగా క్యాన్సర్ కణితిపై రేడియేషన్ ఇస్తారు), సిటి సిమిలేటర్, ప్రత్యేకంగా రేడియాలజి విభాగం, పెథాలజి, మైక్రోబయాలజి విభాగాల సేవలు అందుబాటులోకి వస్తాయి. వీటితో పాటు రేడియేషన్ థెరపిస్ట్, మెడికల్ రేడియేషన్, సర్జికల్ రేడియేషన్, సర్జికల్ అంకాలజిస్ట్, పీడియాట్రిక్ సర్జరీ పోస్టులు, స్టాఫ్‌నర్సులు, పారామెడికల్ సిబ్బంది, నాలుగో తరగతి సిబ్బంది నియమితులవుతారు.

క్యాన్సర్‌కు ప్రధాన కారణాలు

ధూమపానం చేసే వారిలో ఊపిరితిత్తుల క్యాన్సర్ వచ్చే ప్రమాదం 24 నుంచి 35 రెట్లు ఎక్కువగా ఉంటుంది. సిగరెట్లు కాల్చిన వారి పక్కన ఉండి వారు వదిలిన గాలి పీల్చడం(పాసివ్ స్మోకింగ్) ద్వారా 3.5శాతం ప్రమాదాన్ని మరింతగా పెంచుతుంది. మీరు దూమపానం చేయకపోయినా దూమపానం చేసేవారి పక్కన ఉండి వారు వదిలిన గాలి పీల్చడం ద్వారా ఈ క్యాన్సర్ సోకే ప్రమాదం పెరుగుతుంది. దీంతో పాటు గాలి కాలుష్యం, గతంలో చేసిన రేడియేషన్ థెరపీ, వంటచేసే సమయంలో ఉత్పత్తి అయ్యే రాడన్ గ్యాస్ పీల్చడం, ఆర్సెనిక్ క్రోమియం, నికెల్ ఆస్బెస్టాస్, ఇతర పదార్థాలు పీల్చడం ఊపిరితిత్తుల క్యాన్సర్ వచ్చే ప్రమాదాన్ని పెంచుతుంది.

లక్షణాలు–సంకేతాలు

ఊపిరితిత్తుల క్యాన్సర్ సాధారణంగా దాని ప్రారంభ దశలలో సంకేతాలు, లక్షణాలను కలిగించదు. వ్యాధి అభివృద్ధి చెందినప్పుడు వాటి సంకేతాలు, లక్షణాలు సాధారణంగా సంభవిస్తాయి. నిరంతర దగ్గు, దగ్గినప్పుడు రక్తం పడటం, శ్వాస ఆడకపోవడం, ఛాతిలో నొప్పి, బరువు తగ్గిపోవడం, ఎముకల నొప్పి, తలనొప్పి, ఆకలి లేకపోవడం లక్షణాలు ఉంటాయి.



ఊపిరితిత్తుల క్యాన్సర్ రకాలు

1. స్మాల్‌సెల్ లంగ్ క్యాన్సర్ : ఇది చిన్న కణాల ఊపిరితిత్తుల క్యాన్సర్, దాదాపుగా ఎక్కువగా ధూమపానం చేసేవారిలో ఇది సంభవిస్తుంది.
2. నాన్ స్మాల్ సెల్ క్యాన్సర్ : ఇది ఊపిరితిత్తుల క్యాన్సర్‌లలో వివిధ రకమైన క్యాన్సర్‌లు ఉంటాయి.(స్క్వామాసెల్ క్యాన్సర్, అడెనోకార్సినోమా, పెద్ద కణ క్యాన్సర్).

రోగ నిర్ధారణ, చికిత్స

ఊపిరితిత్తుల క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉన్నవారు సంవత్సరానికి ఒకసారి స్క్రీనింగ్ సీటీస్కాన్ చేయించుకోవాలి. వ్యాధి లక్షణాలను బట్టి ఛాతి ఎక్స్‌రే, ఛాతి సీటీ స్కాన్, కఫం సైటోలజికి పరీక్షలు వైద్యులు చేయిస్తారు. రోగనిర్ధారణ, క్యాన్సర్ రకాన్ని గుర్తించేందుకు టిష్యూ బయాప్సీ అవసరమవుతుంది. ఊపిరితిత్తుల క్యాన్సర్ చికిత్స ఆ క్యాన్సర్ దశపై ఆధారపడి ఉంటుంది. శస్త్రచికిత్స, కీమోథెరపీ, రేడియోథెరపీ వివిధ చికిత్సా విధానాలు అందుబాటులో ఉన్నాయి.

ప్రభుత్వ ఆసుపత్రిలో మెరుగైన వైద్యం



హెచ్ఓడి, కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల ప్రపంచ వ్యాప్తంగా ఐదు క్యాన్సర్ మరణాలలో ఒక మరణం ఈ ఊపిరితిత్తుల క్యాన్సర్‌తో సంభవిస్తున్నాయని నివేదికలు చెబుతున్నాయి. అయితే, ఈ క్యాన్సర్ నివారించదగ్గది. దీనిపై విస్తృతమైన అవగాహన ప్రజల్లో కలిగించాలి. ఈ క్యాన్సర్‌కు ప్రభుత్వ ఆసుపత్రిలో ఉచిత వైద్యం అందిస్తున్నాము. త్వరలో స్టేట్ క్యాన్సర్ ఇన్స్టిట్యూట్ పూర్తయితే మరింత మెరుగైన వైద్యసేవలు అందుబాటులోకి వస్తాయి.

–డాక్టర్ సీఎస్‌కే ప్రకాష్, క్యాన్సర్ విభాగం

ధూమపానంతో ఊపిరితిత్తుల క్యాన్సర్



ధూమపానం మానేస్తే ఈ క్యాన్సర్ ప్రమాదం నుంచి తప్పించుకోవచ్చు. ధూమపాన నివారణ కోసం నికోటిన్ ఉత్పాదక స్థాపన ఉత్పత్తులు, మందులు, సహాయక సమూహాలు ఉన్నాయి. ధూమపానం వల్ల ఊపిరితిత్తుల క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉన్న 50 నుంచి 80 సంవత్సరాల వయస్సు గల పెద్దలు ప్రతి సంవత్సరం క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్ష చేయించుకోవాలి. పోషకాహారం తీసుకోవాలి. రోజూ వ్యాయామం చేయాలి.

–డాక్టర్ వెంకట చలమయ్య, ఊపిరితిత్తుల వ్యాధుల నిపుణులు, కర్నూలు

దుష్ప్రభావాలు తగ్గించేందుకు చర్యలు

- జిల్లా కలెక్టర్ డా.జీ సృజన

కర్నూలు(అర్బన్): వాతావరణ మార్పుల వల్ల జరిగే దుష్ప్రభావాలను తగ్గించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డా.జి. సృజన సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక జిల్లా పరిషత్ సమావేశ భవనంలో వాతావరణ మార్పు వల్ల మానవ ఆరోగ్యంపై కలిగే ప్రభావానికి సంబంధించి జిల్లా స్థాయి టాస్క్‌ఫోర్స్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ... వాతావరణ మార్పు వల్ల మానవ ఆరోగ్యం ప్రభావితమై అనేక వ్యాధులు ప్రబలుతున్నాయని, దీంతో పాటు కరువు, వరదలు వంటి ప్రకృతి విపత్తులతో ఓజోన్, వాయు కాలుష్యం, రేడియేషన్ వంటి దుష్ప్రభావాలు తలెత్తుతున్నాయన్నారు. వీటి నివారణ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జాతీయ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమం అమలుకు జిల్లా స్థాయి టాస్క్ ఫోర్స్ కమిటీని ఏర్పాటు చేశామన్నారు. అనంతరం కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. సమావేశంలో డీఎంఅండ్‌హెచ్ఓ డా.రామగిడ్డయ్య, ప్రోగ్రాం ఆఫీసర్ డా.హేమలత పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జిల్లా కలెక్టర్, జేసీ

చైల్డ్ ఇన్ఫోలో అప్‌డేట్ చేయండి

కర్నూలు కల్చరల్: విద్యార్థుల వివరాలను ఎప్పటికప్పుడు చైల్డ్ ఇన్ఫోల్ అప్‌డేట్ చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ గుమ్మళ్ల సృజన అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి వివిధ ప్రభుత్వ అంశాలపై జిల్లా స్థాయి అధికారులతో ఆమె సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాలలు మారిన విద్యార్థులకు టీసీ ఇచ్చి చైల్డ్ ఇన్ఫోలో పేర్లు తొలగించాలన్నారు. లేని పక్షంలో చర్యలు తీసుకుంటామన్నారు. వీసీలో జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

కర్నూలు(రూరల్): హమాలీ కార్మికుల కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని సీఐటీయూ నగర అధ్యక్ష, కార్యదర్శులు నరసింహులు, సాయిబాబా డిమాండ్ చేశారు.ఈ అంశంపై సోమవారం ఏపీ వేర్ హౌస్ హమాలీ కార్మికులతో సంతకాలు సేకరించారు.

తాగునీటి సమస్యను పరిష్కరించాలి

కర్నూలు(రూరల్): నగరంలోని 23, 24 వార్డుల్లో నెల కొన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని సీపీఎం నగర నాయకులు వెంకటేశ్వర్లు, శేషాద్రి సోమవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ఆయా వార్డుల్లో పది రోజులుగా ఈ సమస్య ఉందన్నారు.

తల్లిపాల వారోత్సవాలు నిర్వహించండి

కర్నూలు(హాస్పిటల్): ఈనెల ఒకటి నుంచి 7వ తేదీ వరకు తల్లిపాల వారోత్సవాలు నిర్వహించాలని డీఎంహెచ్ఓ డాక్టర్ బి. రామగిడ్డయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి ఆశా, ఏఎన్ఎంలు విస్తృత ప్రచారం చేస్తూ పుట్టిన వెంటనే పిల్లలకు తల్లులు పాలు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు.

కడపలో స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేయాలి

కర్నూలు కల్చరల్: కేంద్ర ప్రభుత్వం కడపలో స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ప్రభాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ సోమవారం కలెక్టరేట్ వద్ద సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాధాకృష్ణ, నగర కార్యదర్శి రాముడు, ఓల్డ్‌సిటీ కార్యదర్శి రాజశేఖర్ పాల్గొన్నారు.

మహా పాదయాత్రకు మద్దతు

కర్నూలు(రూరల్): జిల్లా సమగ్రాభివృద్ధి కోసం సీపీఎం తలపెట్టిన మహా పాదయాత్రకు మద్దతునిస్తున్నట్లు సివిల్ సప్లై హమాలీ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణ తెలిపారు. ఆగస్టు 2 నుంచి 7 వరకు జరిగే ఈ పాదయాత్రలో పాల్గొంటున్నట్లు డీఎంకు ఆయన సోమవారం వినతి పత్రం అందజేశారు.

ట్రాఫిక్ ఎస్ఐ స్వచ్ఛంద పదవీ విరమణ

కర్నూలు : ట్రాఫిక్ పీఎస్‌లో పనిచేస్తున్న ఎస్ఐ డి.సిద్ధయ్య స్వచ్ఛంద పదవీ విరమణ చేశారు. ఈయన 1987లో పోలీసు శాఖలో కానిస్టేబుల్‌గా చేరి అంచెలంచెలుగా ఎదిగి 2021లో ఎస్ఐగా పదోన్నతి పొందారు. జిల్లాలోని కర్నూలు వన్‌టౌన్, టూటౌన్, త్రీటౌన్, ఫోర్త్‌టౌన్, పీసీఆర్, బేతంచెర్ల, స్పెషల్ బ్రాంచ్ విభాగాల్లో పనిచేశారు. ఈ సందర్భంగా సోమవారం సాయంత్రం ట్రాఫిక్ డీఎస్పీ నాగభూషణం ఆధ్వర్యంలో ట్రాఫిక్ అధికారులు, సిబ్బంది ఆయనను ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు.

మధ్యాహ్న భోజన ఆయాలకు బడ్జెట్ పెంచాలి

కర్నూలు కల్చరల్: మధ్యాహ్న భోజన వర్కర్లు, ఆయాలకు బడ్జెట్ పెంచాలని ఏపీ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ జిల్లా నాయకులు లీలావతి, ఎస్తేరమ్మ, మద్దమ, సీఐటీయూ జిల్లా కార్యదర్శులు నిర్మలమ్మ, నాగేశ్వరరావు, జిల్లా అధ్యక్షుడు రాధాకృష్ణ డిమాండ్ చేశారు. యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు.

అక్రమ భవన నిర్మాణాలకు నోటీసులు

కర్నూలు (టౌన్) : నగరపాలక పరిధిలో అనుమతిలేకుండా అక్రమంగా వాణిజ్య, భవన నిర్మాణాలు చేపట్టిన యజమానులకు సోమవారం పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు నోటీసులు జారీ చేశారు. కాంగ్రెస్ పార్టీ కార్యాలయం సమీపంలోని నెహ్రూ రోడ్డులో ప్లాన్‌కు విరుద్ధంగా నిర్మిస్తున్న వాణిజ్య భవనానికి తాజాగా రెండో నోటీసు ఇచ్చారు.

విద్యుత్ ఉద్యోగుల సమస్యలపై నిర్లక్ష్యం తగదు

కర్నూలు(రాజ్‌విహార్): విద్యుత్ ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో ఉన్నతాధికారులు నిర్లక్ష్యం వహించడం తగదని విద్యుత్ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ గణేష్ అన్నారు. జేఏసీ ఆధ్వర్యంలో సోమవారం జెడ్పీ, పాతబస్టాండ్ వద్ద ఉన్న గాంధీ విగ్రహాలు, సప్తగిరి నగర్‌లోని ఉయ్యలవాడ నరసింహారెడ్డి విగ్రహాల వద్ద ప్లకార్డులతో నిరసన తెలిపారు. జేఏసీ కన్వీనర్ లక్ష్మీకాంత్‌రెడ్డి, కార్యదర్శి రంగస్వామి, ఇతర సంఘాల నాయకులు, ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు.

మొక్కలను సంరక్షించుకోవాలి

కర్నూలు కల్చరల్: నాటిన మొక్కలను సంరక్షించుకోవాలని జిల్లా అటవీ శాఖ అధికారి పల్లె శివశంకర్‌రెడ్డి అన్నారు. ఆ శాఖ ఆధ్వర్యంలో ఆదోని డివిజన్‌లో జరుగుతున్న మొక్కలు నాటే కార్యక్రమంపై సోమవారం ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ ఏడాది 40 హెక్టార్లలో మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు.

సబ్ ప్లాన్ నిధులు మంజూరు

కర్నూలు (టౌన్): నగర పాలక సంస్థ పరిధిలోని ఎస్సీ కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు రూ.14.64 కోట్లు విడుదల చేస్తూ మున్సిపల్ పరిపాలన శాఖ సంచాలకులు కోటేశ్వరరావు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నిధులతో ఎస్సీ కాలనీల్లో రోడ్లు, మురుగు కాల్వలు, రహదారుల విస్తరణ, గ్రీనరీ, పార్కులు తదితర అభివృద్ధి పనులు చేపడతారు.

స్పాట్ బిల్లింగ్ ప్రారంభించండి

కర్నూలు(రాజ్‌విహార్): నెలవారి విద్యుత్ బిల్లుల జారీ ప్రక్రియ స్పాట్ బిల్లింగ్‌ను మంగళవారం నుంచి ప్రారంభించాలని దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కర్నూలు ఆపరేషన్స్ ఎస్ఈ ఎం. ఉమాపతి ఆదేశించారు. సోమవారం ఆయన స్థానిక విద్యుత్ భవన్ నుంచి కింది స్థాయి అధికారులతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కర్నూలు, నంద్యాల జిల్లాల్లో 1 తేదీ నుంచి తప్పనిసరిగా స్పాట్ బిల్లింగ్ చేపట్టి, వినియోగదారులకు డిమాండ్ నోటీసులు జారీ చేయాలని సూచించారు. ముఖ్యంగా ప్రతి ఇల్లు, షాపు వద్ద ఉన్న మీటర్ వద్దకు వెళ్లి డిజిటల్ స్కాన్ చేసి బిల్లింగ్ తీయాలన్నారు. మీటర్లు స్కానింగ్ కానిపక్షంలో పై అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని పేర్కొన్నారు.

వ్యవసాయంపై అవగాహన

కర్నూలు(అగ్రికల్చర్): వివిధ పంటల సాగు, వ్యవసాయ చట్టాలపై ఇన్‌పుట్ డీలర్లకు అవగాహన పెంచడమే లక్ష్యంగా దేశీ డిప్లొమ కోర్సు నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర దేశీ కోర్సు కన్సల్టెంటు భగవత్ కాంచన తెలిపారు. దేశీ డిప్లొమ కోర్సు 4వ బ్యాచ్‌లో శిక్షణ పొందిన ఇన్‌పుట్ డీలర్లు తయారు చేసిన రికార్డులు, శిక్షణపై దేశీ సమన్వయకర్త, విశ్రాంత డీడీఏ నాగేంద్రయ్య రూపొందించిన నివేదికను సోమవారం పరిశీలించారు. జిల్లా వ్యవసాయాధికారి కార్యాలయంలోని ఆత్మ డిప్యూటీ ప్రాజెక్టు డైరెక్టర్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆత్మ డీపీడీ శ్రీలత, విశ్రాంత డీడీఏ నాగేంద్రయ్య కూడా పాల్గొన్నారు.

కుల రహిత సమాజం నిర్మిద్దాం



మాట్లాడుతున్న సీఐ మురళీధర్‌రెడ్డి

కర్నూలు(అర్బన్): గ్రామాలు, పట్టణాల్లో అక్కడక్కడా పొడచూపుతున్న కుల వివక్షను రూపుమాపి కుల రహిత సమాజాన్ని నిర్మిద్దామని కర్నూలు 3వ పట్టణ సీఐ మురళీధర్‌రెడ్డి అన్నారు. సోమవారం సాయంత్రం స్థానిక అరోరానగర్‌లోని మున్సిపల్ పాఠశాలలో ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు పీటీ సాయి ప్రదీప్ ఆధ్వర్యంలో సివిల్ రైట్స్ డే నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఐ సురేష్, డీవీఎంసీ సభ్యులు సాయి ప్రదీప్, నవీన్, ప్రభుదాస్, మాజీ సభ్యులు రాజశేఖర్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సెల్ ప్రధాన కార్యదర్శి యాట ఓబులేసు, శ్రీరాములు, ఇమ్మానియేల్, మాధవ కృష్ణుడు, మెప్మా పీఓ లక్ష్మి పాల్గొన్నారు.

ఇంటి ముంగిటకే సంక్షేమ పథకాలు



సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, మేయర్ రామయ్య

- గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే కాటసాని, మేయర్ బీవై రామయ్య

కల్లూరు: దేశంలో ఎక్కడా లేని విధంగా కుల, మత, రాజకీయ, పార్టీలకు, వర్గాలకు అతీతంగా అర్హులైన వారందరికీ ఇంటి ముంగిటకే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అందిస్తున్నారని కర్నూలు, నంద్యాల జిల్లాల వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు మేయర్ బీవై రామయ్య, ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం కల్లూరు అర్బన్ 19వ వార్డు నాల్గవ తరగతి ఉద్యోగుల కాలనీలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే, మేయర్ ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాల వల్ల చేకూరిన లబ్ధిని ప్రజలకు వివరిస్తూ బుక్‌లెట్లను పంపిణీ చేశారు.

అన్ని వర్గాలకు సమ ప్రాధాన్యం

మేయర్ మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని వర్గాలకు సమ ప్రాధాన్యం వేశారన్నారు.రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం వెల్లివిరుస్తుందన్నారు. ప్రజలందరికీ మంచి చేశాం కాబట్టే ప్రజల్లోకి ధైర్యంగా వెళ్లుతున్నామని చెప్పారు.రాబోయే ఎన్నికల్లో ముఖ్యమంత్రిగా మరోసారి జగన్‌మోహన్‌రెడ్డికి పట్టంకట్టాలని కోరారు.

జగన్ పాలనకు జనం జేజేలు

ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో అవినీతి రహితంగా ప్రజాజనరంజాక పాలన అందిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి జనం జేజేలు పలుకుతున్నారన్నారు. రాష్ట్రంలోని పేదలందరి మోములలో చిరునవ్వులతో సంతోషంగా సంక్షేమ పథకాలతో వారు పొందిన లబ్ధిని వివరిస్తున్నారన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మహేశ్వర్‌రెడ్డి, కార్పొరేటర్లు అరుణ, శ్వేతారెడ్డి, సుదర్శన్‌రెడ్డి, లక్ష్మీకాంతరెడ్డి, నారాయణరెడ్డి, విక్రమసింహారెడ్డి, డీఈఈ రవిప్రకాష్ నాయుడు, స్థానిక వార్డు నాయకులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకులకు ప్రజా శ్రేయస్సు పట్టదు

- కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్
- నగరంలోని వివిధ వార్డుల్లో జగనన్న సురక్ష కార్యక్రమం

కర్నూలు (టౌన్): తెలుగుదేశం నాయకులకు అధికార దాహం తప్పా ప్రజా శ్రేయస్సు పట్టదని ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ విమర్శించారు. 14 సంవత్సరాలు పాలించిన ఆ పార్టీ ప్రజలకు ఏం చేసిందో.. చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక నగరంలోని 3, 9, 46, 49 వ వార్డులలోని 6,8,22,23, 119 ,129,130 వ సచివాలయాల పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్ఆర్‌సీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజా సంక్షేమం, అభివృద్ధికి ఎంతో ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఎన్నికల హామీలను తూచ తప్పకుండా పాటించిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్నామన్నారు. నాలుగేళ్ల ఇంటికే పరిమితమైన టీజీ కుటుంబం ఇప్పుడు ఎన్నికలు దగ్గర పడుతుండటంతో హడావుడి చేస్తుందన్నారు. అయితే, వారిని ప్రజలు నమ్మరన్నారు. అనంతరం దరఖాస్తుదాలకు వివిధ సేవలకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలను ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్లు, వార్డు ఇన్‌చార్జ్‌లు, స్పెషల్ ఆఫీసర్లు, సచివాలయాల కన్వీనర్లు, పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.



నరసింహారెడ్డి నగర్‌లో లబ్ధిదారులకు సర్టిఫికెట్లు పంపిణీ చేస్తున్న కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్

సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శం

కర్నూలు(రాజ్‌విహార్): రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన సచివాలయ వ్యవస్థ ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచిందని ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ అన్నారు. సోమవారం ఆయన స్థానిక 5వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. చిత్తారిగేరి వీధుల్లో ఇంటింటికి వెళ్లి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాలను నేరుగా ప్రజల ఇంటి వద్దకే తీసుకెళ్లాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి సచివాలయ, వలంటీర్ వ్యవస్థలను తీసుకొచ్చినట్లు చెప్పారు. కార్యక్రమంలో కార్పొరేటర్ సుజాత, పార్టీ నాయకులు శేషయాదవ్, అక్బర్ అలీ, మహబూబ్ బాషా, మక్బూల్, అబ్దుల్లా పాల్గొన్నారు.

కర్నూలు పౌర సమాజం ఆధ్వర్యంలో నగరంలో మహా ప్రదర్శన

మణిపూర్ ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేయాలి



మణిపూర్ ఘటనపై కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న కర్నూలు పౌర సమాజం

కర్నూలు కల్చరల్: మణిపూర్ ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేయాలని కర్నూలు పౌర సమాజం నేతలు డిమాండ్ చేశారు. సోమవారం 42 సంఘాలు, సంస్థలతో ఐక్యంగా ఏర్పడిన కర్నూలు పౌర సమాజం ఆధ్వర్యంలో మణిపూర్ మారణ హోమాన్ని ఆపాలని డిమాండ్ చేస్తూ కర్నూలు నగరంలో మహా ప్రదర్శన నిర్వహించారు. జిల్లా పరిషత్ నుంచి కలెక్టరేట్ వరకు సాగిన ఈ ర్యాలీలో కర్నూలు పౌర సమాజం నేతలు మాట్లాడుతూ ఆ రాష్ట్ర ప్రభుత్వం మత ఉన్మాదాన్ని రెచ్చగొడుతుందన్నారు. మహిళలను నగ్నంగా తిప్పి అత్యాచారాలు చేసి చంపిన మానవ మృగాలను కఠినంగా శిక్షించాలన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి అబ్దుల్లా అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో విశ్రాంత అధ్యాపకులు మన్సూర్ రెహమాన్, కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆనంద్‌బాబు, గ్రామిక మహిళా సంఘం జిల్లా కార్యదర్శి నిర్మల, జమాతే ఇస్లాం హింద్ కార్యదర్శి ఉమేరా భాను సాహెబ్, ఆవాజ్ జిల్లా ఉపాధ్యక్షులు ఇక్బాల్ హుసేన్, షరీఫ్, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కిరణ్, జాతీయ మాల మహానాడు కార్యదర్శి మునయ్య, ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి అలివేలమ్మ, ఏఐడీఎస్ఓ రాష్ట్ర అధ్యక్షుడు హరీష్‌కుమార్, డీవైఎఫ్ఐ, ఆర్‌పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శులు పుల్లారెడ్డి, నగేష్, గురుశేఖర్, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పీఎస్ రాధాకృష్ణ, తదితరులు నిరసనలో పాల్గొని ప్రసంగించారు.

డాక్టర్ నరేంద్రనాథ్‌రెడ్డి సేవలు అభినందనీయం

కర్నూలు(హాస్పిటల్): కోవిడ్‌తో భయబ్రాంతులకు గురవుతున్న సమయంలో కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ నరేంద్రనాథ్‌రెడ్డి అందించిన సేవలు అభినందనీయమని వక్తలు కొనియాడారు. పదవీ విరమణ చేయనున్న డాక్టర్ నరేంద్రనాథ్‌రెడ్డితో పాటు మైక్రోబయాలజి అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ జనార్ధన రాజులను సోమవారం కర్నూలు మెడికల్ కాలేజీలోని క్లినికల్ లెక్చర్ గ్యాలరీలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ పి. సుధాకర్, వైస్ ప్రిన్సిపాల్‌లు డాక్టర్ వెంకటరంగారెడ్డి, డాక్టర్ హరిచరణ్, డాక్టర్ సాయిసుధీర్, డాక్టర్ రేణుకాదేవి, డాక్టర్ చిట్టినరసమ్మ, ఆసుపత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ సి. ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో...

ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో సూపరింటెండెంట్ డాక్టర్ జి. నరేంద్రనాథ్‌రెడ్డిని కార్యాలయ ఉద్యోగులు, వైద్యులు ఘనంగా సన్మానించారు. ధన్వంతరి హాలులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ఆసుపత్రిలోని పలు విభాగాల్లో అందించిన సేవలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ సి. ప్రభాకర్‌రెడ్డి, ఏడీ రమేష్‌బాబు, సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ బి. వెంకటేశ్వరరావు, డిప్యూటీ సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ హేమనళిని, ఆర్ఎంఓ డాక్టర్ వెంకటరమణ, నర్సింగ్ సూపరింటెండెంట్ గ్రేడ్–1 వెంకట తులశమ్మ, గ్రేడ్–2లు సావిత్రిబాయి, నాగమణి, వైద్యులు, ఉద్యోగులు పాల్గొన్నారు.



మెడికల్ కాలేజీలో డాక్టర్ నరేంద్రనాథ్‌రెడ్డి దంపతులను సన్మానిస్తున్న అధికారులు, వైద్యులు